పుణ్యం

సువర్ణముఖి

దూరంగా బోడికొండ. సగం వరకూ నీడ, పైన ఎండతో గురివింద గింజలా కనిపిస్తోంది. ఆలయ ప్రాంగణం చుట్టూరా వడిసె కంపల ఎలుగు. మండపంపై ప్రెసిడెంట్ కామేశ్వరరావు, చుట్టూ వూర్లో పెద్ద బుర్రలైన ఆలయ నిర్మాణ దాతలూ కూర్చున్నారు.

''జనవండీ... జనవు... ఎప్పుడు ఎపుడేటి సేత్తాడో... ఎవుడి బుద్దెలాగుంతాదో సెప్పనే పోతన్నం... ఊకబోత్తే ఊకరాల్దు. జనవనుకోవాలేగాని... దేని మీద కన్ను బడినా దాని అంతుచూడనిదే వదలరండి... నాను కలలో గూడ అనుకోనేదండి. యింత జనవు యిరగబడిపోయి సూపులు సూత్తారని'' కూర్మినాయుడు చెబుతూనే వున్నారు.

ఆలయ ప్రాంగణాన్ని ఆనుకొని, కొండ అంచుల దాకా విస్తరించిన ఎస్.టి.ఎం.వారి టేకు మొక్కలు, ఆశ్రమ పాఠశాల పిల్లల్లా వున్నాయి. గాలికి 'థింసా' నృత్యంలా ఊగుతున్నాయి. పంపుసెట్ల శబ్దాలు వినిపిస్తూనే వున్నాయి.

చుట్టూ పేరుకుపోయిన చెత్తా-సెదారం, తుప్పా డొంకల్ని విన్నటి నుండి తీస్తున్నాడు ఉప్పరరాములు. రాములు ఇంటి పేరు ఎవురికీ తెలీదు. కులం పేరుతోనే ఉప్పరరాములని పిలుస్తారు. "ఆలయానికి ఆదరణ పెరిగింది... భక్తుల కోసం మరిన్ని సౌకర్యాలు చేయాల్సిన అవసరం ఎంతైనావుంది ఏమంటారు" అన్నారు సీతారామస్వామిగారు.

"ప్రెసిడెంట్‌గారు తలుసుకుంటే - అదొక పనే! కైలాస మెచ్చి - బూవ్వీద వోల్తాది. కాపోతే! ఈ ఎవసాయాలు, ఈ అరటి గెలలు, ఈ టేకు మొక్కలు... ఈ కల్లతోటి సూత్తానున కొన్నామేటి? విరుడు ఈ టయానికి, ఉడతలు గుడ్లులు బెట్టిన బూవులు. ఆ తువికడొంకలో, తుమ్మడొంకలో మొండి మొక్కలు గాబట్టి విలబడేవి. పచ్చటి పనికొచ్చిన మొక్క సూద్దమంతే లేదు. అదిగలాపింటిది... ఏ మూర్తాన బావు ... భూమిలేపారంల సెయ్యి బెట్టివాడో!... పలికింది గొర్నాపి గుడ్డిలికి రేటు!... అదిగదయితు... మరి తిరుగు చూడలేదు... ఎత్తికెలిపోయింది బూవికి రేటు! అదిగంచేత తమరు సెయ్యెట్టివారంతే - ఎగువ తిరపతిలు, దిగువ తిరపతిలు దిగదుడుపు. లొత్తాయి మన దేముడు ముందు" అన్నారు భూమివి అమ్మేసిన పెద్ద రైతు గొర్జావ కూర్మినాయుడు.

కామేశ్వరరావుగారు చిరునవ్వు నవ్వి -

"ఇందలో వాదేటుంది కూర్మినాయుడుగోరు... ఈ కరువులు కాలం సెజల కవుకులు బగవంతుడు సూడలేక - కమ్మ రైతుల రూపాన, మన ముక్కున అడుగుమెట్టాడు - నా చేతితోటే, తొలితొలేత, ఎవిమిది వేలుకి ఎకరా యిచ్చివాం. తరవాత పదివేలుకి

> అదిగదే లెక్క! ఎవుడి వస్తువు ఆడు దాసుకోవాలి. ఎవుడి సంపద ఆడు నిలబెట్టుకోవాలి. మీ చుట్టం నిలబెట్టుకోలేదు పోనాడు. అందులోకి ఈ ఎస్.టి.ఎం వాళ్ళూ, మేక్స్ వర్తోలు వచ్చిన తరవాత బూవికి రేటు పెరగడమే కాక కూలిపనులు కూడ దొరుకుతున్నయ్''

యిచ్చివాం. ఆ టైంలో... రైతులు బూవులమ్మేడానికి నా ఇంటి దగ్గర "కూ"(క్యూ)... పది వేలంతే అష్టకష్టాలపైపోనారు. అలపింటిది. ఈవాళ నా చేతితోటి వలపై వేలుకి వస్తవెత్తుతున్నాను" అన్నారు నవ్వు మొకం చెదరకుండా కామేశ్వరరావుగారు.

ఆ మాటకి తుప్ప నరుకుతున్న ఉప్పరరాములు కలుగజేసుకొని - "అష్టకష్టాలమైన రైతులు - ఆర్తకర్పూరంలాగ ఆరిపోనారు బావు"

"ఓర్రెరి నా కొడుకా... నీకేటి తెలుసురా! ఎల్లురా... ఆవూలికొల్ని, సీతంపేట దళీపేట, వన్నాం, మాదలింగి, కిచ్చాడ, వులిగుమ్మి... ఏటి సూత్తామా - రైతులు... టీవీలు, ఫేనులు, స్కూటర్లు, మోటర్లు ఇల్లునిండ సామాన్లు కొనీపి, పిలకట్టులిప్పీపి ఫేంటు లేసినారు. చుట్ట జల్లీపి, పిగరెట్ ముట్టించారు. ఆల జెలసా ఏటి సూత్తాం. ఆల సోకులేటి సూత్తాం... ఆల కరుసేటి సూత్తాం" అని వెటకారంగా నవ్వి, ప్రెసిడెంట్ గారి ముఖం చూసాడు కూర్మినాయుడు.

"ఆడికేటి తెలుసు! పూటల్లా కష్టబడ్డం. పూటుగా తాగేసి తొంగోడం... ఈ పంసారాలు, పరదాలు,



సామాన్లు ఆడికేటి తెలుసూ"

"బావూ మీరన్నది యెతార్తం బావూ! ఈ జల్సాలు, పరదాలు, సామాన్లు నాకు తెల్దు బావు... బావూ సావుకారోడు బూవులమ్మితే రూపాయికి రెండు సేత్తాడు. ఏపారం మీద ఎక్కువ సేత్తాడు. రైతోడు బూవులమ్మితే... రూపాయికి రూపాయి ఆరిపేపి, బీకారోడు అయిపోతాడు బావు. నా కళ్లతో నాను సూసినాను. మా చెక్క నలన చుట్టం ఇలిగే అమ్మీపి, నాలుగు రోజులు టిప్‌టాప్ చేసినాడు బావు, మరిప్పుడో - టియ్యి చుక్కకి తికానా లేదు బావ్" తన చుట్టం బాధ తన గొంతులో చూపించాడు రాములు.

ప్రెసిడెంట్‌గారు పకపక నవ్వారు. నవ్వుతూ -

"రాములూ... నీ చేతిలో గునపాముంది. పనై పోయిన తరవాత ఇంటికి తీసికెలిపోతవు దాసుకుంతావు. .. దాసుకోనేటిమరి?... మళ్ళీ రేపు పనిలోకి తెత్తావు. తేనేటిమరి? అదిగదే లెక్క! ఎవుడి వస్తువు ఆడు దాసుకోవాలి. ఎవుడి సంపద ఆడు నిలబెట్టుకోవాలి. మీ చుట్టం నిలబెట్టుకోలేదు పోనాడు. అందులోకి ఈ ఎస్.టి.ఎం.వాళ్ళూ, మేక్స్‌వర్తోలు వచ్చిన తరవాత బూవికి రేటు పెరగడమేగాక కూలి పనులు కూడా దొరుకుతున్నయ్" అని ప్రెసిడెంట్‌గారు ఏదో చెబుతుండగానే - కూర్మినాయుడు మధ్యలో ఎత్తుకొని -

"ఆదూను ఎందుకులెండి. కురుపాం, కొమరాడ మండలాల ప్రజలకి మీరు సెయ్యవలసినంత చేసారు. ఒట్టినే యిత్తామంతే వద్దనీసిన బూవులికి విలువ తెచ్చారు. విలువంటే... ఏవాడైనా కలగన్నామేటి?... నలపై వేలు నక్కసారి ఈ కళ్లతో సూసినామేటి? మా ఊసాదిలీయండి. ఈ ఉప్పరోడు వలపై రూపాయిలు సూసినాడేటి?"

"యిలువ పెంచినాను బావూ... యిలువ పెంచవేదవి, యిలాగ ఈ ముక్కని ఎవులైనా అంతే... అల నోరు పడిపోద్దిబావ్... కాని బావ్ - బూవులికీ, వస్తువులుకీ యిలువులు పెరగొచ్చు... తగ్గొచ్చు. నరతోటలోన మానవ జలమెత్తిన తరవాత, యిలువు పెరగాలేగాని, తగ్గగూడదు బావు. అదిగలాపింటిది... ఇక్కడేటి జరిగింది? భూవికి యిలువు పెరిగింది. మడిసికి యిలువు పడిపోయింది. బగమంతుడి దయ వల్ల మనిద్దరికీ సేణముండాలిగాని, ఏడాది తిరక్కమునువు, ఆలొచ్చి నీ కాళ్ల మీద 'అన్నమో రామచంద్రా' అని పడతారు. అపుడు యిలువు పెంచుతానో... ఇంటిలో ఉరి పోసుకోమంతానో నువ్వే సెప్పాల మరి". గునపాం బుజానికి సేరేసి కూర్చుండిపోయాడు ఉప్పరరాములు.

ప్రెసిడెంట్‌గారు మౌనంగా మండపం వైపు ఒక నిముషం, మరో నిముషం ఆకాశం వైపు చూశారు.

ప్రెసిడెంట్ ముఖం చూసి కూర్మినాయుడు ఎత్తుకొన్నాడు.

"ఈడితో మాటల్లో పడి - అసలు పని మానేసాం. ఆడూ మనతోటి సమానంగా కూర్చుండిపోనాడు. రావులో ఎల్లురా" అంటూ రాములుకి పని పురమాయించి పంపేశాడు.

"అదండి... అంచేత! ఆదరణతోపాటు ఆదాయం కూడా పెరిగింది గాబట్టి విశ్రాంతి గదులు కట్టడం... కళ్యాణ మండపం కట్టడం అవసరమనుకొంటాను" మళ్లీ చెప్పాడు సీతారామస్వామి.

"అంత ... డబ్బూ..." ప్రెసిడెంట్‌గారి మాట బయటకు రాకుండానే -

"అవుద్దండీ.... డబ్బుకి జంకితే ఏ పనీ సెయ్యలేం... అడుగు తీసి, అడుగేస్తే డబ్బూ, డబ్బూ, డబ్బు. అయినామీరు 'ఊ' అనండి. ఊరల్లా చందాలెత్తినాను తెత్తాను"

ప్రెసిడెంట్‌గారు మౌనంగా ఏదో ఆలోచిస్తూ -

"సరే... రేపు మరొక్కసాలి అందరితో మాట్లాడాలి" అంటూ లేచి నిలబడ్డారు వెళ్లిపోవడానికి.

సాయంత్రం అయిపోతుంది కొండ సిమిడి సిక్క లాగ మారిపోయింది. ఎస్.టి.ఎం.వారి లేబర్ కేరేజిలు వూపుకొంటూ, గుంపు గుంపులుగా వెళ్ళిపోతున్నారు.

"బావ్" ప్రెసిడెంట్‌గార్ని పిలిచాడు రాములు.

"ఏటిరా?"

"మరేటి బావ్? తమరు విన్నొత్తారని ఆయాలదాకా సూసినాను, తవరు రానేదు... విన్నటిదీ యియ్యాలదీ కలిపి మొత్తం కూల్డబ్బులు యిచ్చీయండి బావ్"

"కూలే..." కూర్మినాయుడు ఆశ్చర్యపోయాడు.

"ఏటిబావ్! అలగ నిలబడిపోనారు... కూలి డబ్బులు బావూ"

"కూల్డబ్బులా?... ఏటిరా! ఏటి మాట్లాడతన్నవురా... నువ్వు ప్రెసిడెంట్ ఇంటికాడ పని జేసినావా? నా యింటికాడ పనిజేసినావా? - సాచ్చాత్తు బగమంతుడి గుడిలోన. ఎన్ని జనమలెత్తినా... అలాంటి సేవ దొరుకుతాదిరా? ఆలాటి పున్నెమొత్తాదిరా" కూర్మినాయుడు, రాములు అమాయకత్వంపై కోపమయ్యాడు. అక్కడ కూర్చున్న నలుగురు పెద్దమనుషులూ చిరునవ్వులు నవ్వి, మనిసో మాట చెప్పారు-

"ఓ రెర్రి నా కొడుకా! పెద్ద పెద్ద నచ్చాధికారులు, కార్లుమీదొచ్చి కోవెల దగ్గర ఎంగిలాకు లెత్తడానికి కుమ్ములాడుకొంతన్రు... ఎందుకనుకున్నవురా? ఆ ... అది నీకు తెలుసా? పుణ్యం కోసం."

"అంతవరకేల?... నీకు కాశి గురించి తెలుసా?... కాశీలో గొప్పతనమేటో తెలుసా?... పచ్చిన శవాల్ని కొనుక్కొని కాల్చడానికి పోటాపోటీలు. ఎందుకు?... పున్నెంకే!"

"ఓసి... ఎక్కడికో ఎలిపోవడమేల? ... మన గురుబక్తులేటి సేత్తన్రు. గురువు కాలు కడిగిన నీలు తాగుతన్రు... అవకాశం దొరకాలి కదా! ఎందుకు? పున్నెం కోసవే"

"దేవుడి పనికి డబ్బులేటి సెప్మీ! మరంచేత యిక్కడన్నావు... సైపుచ్చుకొన్నాం. మరెక్కడా అనకు సుమీ" ముక్తాయింపుగా అని తువ్వాలు దులిపి లేచాడు కూర్మినాయుడు.

"యింతన్నవురా రావులో! ఒక్కొక్కలు ఒక్కో రీతిని సాయింజేత్తారు ప్రెసిడెంట్‌గోరు చోటిచ్చారు. యింజనీరుగోరు ఇసుకిచ్చారు. కాంట్రాక్టర్ చిరంజీవులుగోరు సిమ్మెంటు యిచ్చినారు. కూర్మినాయుడు బండీ బక్కలతోటి ఇసక పెరిగించినాడు - ఈ నాలుగిమ్ములూ - నువ్వు ఇవ్వనేవు. సెయ్యి సాగనోలు ఏటిసేత్తారు. సెమదానం సేత్తారు... పున్నెం సంపాదించడానికి బోల్డన్ని దారులు రా!" మరో పెద్దమనిషి సుదీర్ఘంగా వివరణిచ్చారు.

అంతవరకూ మౌనంగా వింటున్న రాములు తలెత్తి పెద్దమనుషుల వైపు చూసి, "బావూ మీరు పెద్దోలు... నాలుగు పక్కల తిరిగినోలు, నాలుగు రకాలు తెలిసినోలు. మీకు నాను సెప్పడమేటిగాని,! - పున్నెం సంపాదించడానికి, మీరన్నట్టగా బోల్డన్ని దార్లు వుంటే వుండొచ్చుగాక. గాని బావ్! నా కడుపు జరగడానికి మాత్రం కష్టబడడ మెక్కడే దారి బావు"

"అదండీ! మనం పున్నెం రా పున్నెమని, గంట మంచి గింజుకుంటే ఈ చెవుతోటి ఇన్నట్టగే యిని, ఆ చెవులోంచి వదిలేసినాడు. "అయినా మనది తప్పు... యిలువలు గురించి పుణ్యం గురించి ఉప్పరోడికి సెప్పడమేటి సెప్మీ"

"అందుకే ఆడికి ఉప్పరరాములన్నారు" అన్నాడు కూర్మినాయుడు. అందరూ గొల్లున నవ్వారు.

"బావూ! మీరు ఉప్పరోడు అంతే... నాకే బాధ లేదు... సిన్నతనమూ కాదు. ఎందుకంతే... నాను ప్పరోడికే పుట్టాను. ఇంజనీరు బావు యిసుకిత్తాడు. కాంట్రాక్టరు బావు సిమ్మెంటు యిత్తాడు. ఎవుడి దగ్గిరో మిగలేసి, మీకు యిత్తాడు. బావూ అన్నేయంగా నా నెవుడిదీ... ఒక సైసా పడేసుకోనేదు బావ్.

పాప మెక్కడుంతే... బయిం అక్కడుంతాది. నానే పాపం సెయ్యనేదు. అలాగని ఒకలింటికెల్లి అంబలెయ్యమని, ఒక లింటికెల్లి గెంజి పొయ్యమని అడుక్కొని బతకనేదు బావ్.

కష్టబడతన్నాను. గెంజో గడుగో తాగుతున్నాను - కష్టపడినోడికి కూలిగావాలి గాని - పున్నెమేల బావ్? కూరొండుకుంతావా? పులుసొండుకుంతావా?, బావూ! అదిగో ఆ కొరదా మిగిలిపోయింది. నాను రేపు రాను. మీరే సేసుకోండి బావూ పున్నెవస్తాది" అని రాములు ధీమాగా చెప్పితే

> పాపమెక్కడుంతే... బయిం అక్కడుంతాది. నానే పాపం సెయ్యనేదు. అలాగని ఒకలింటికెల్లి అంబలెయ్యమని, ఒకలింటికెల్లి గెంజి పొయ్యమని అడుక్కొని బతకనేదు బావ్. కష్టబడతన్నాను. గెంజో గడుగో తాగుతున్నాను. కష్టపడినోడికి కూడుగావాలి గాని. పున్నెమేల బావ్? కూరొండుకుంతావా పులుసొండుకుంతావా?

- అందరూ అమాయకంగా చూసారు రాముల్ని.

గునపాం బుజాన వేసుకొని -

"బావూ! ఈవాళ చిల్లరవేస్తోతే రేపైనా నా కూల్డబ్బులు నా మొకాన కొట్టండి. అంతేగాని సెమదానం కింద జమచేస్తే - నా శవాన్ని దానంజేసి పున్నెం కట్టుకోండి" అనేసి గబగబా వెళ్లిపోయాడు.

వచ్చేవారంకథ

పాచిక

-లాలస